# గదులు

[illegible] నా గది-నా గది ప్రక్క

ప్రక్కనే ఉన్నాయి. అయినా! ఈ గది అటుగాని ఆ గది యిటుగాని మారలేవు రెంటికి తమ-తమ హద్దులున్నాయి. రెంటి మధ్య కేవలం ఒక సన్నని గోడ మాత్రమే ఉంది. పొరపాటున ఎప్పుడన్నా ఏదైనా నీ చేతిలోనుంచి జారిపడిందా ఆ ధ్వని నా గదిలో వినిపించేది. పైగా నా గదిలోనే జారిపడినట్లనిపించేది నీకు గుర్తుందా ఒకరోజు గోడకు నీ వైపు మేకు కొట్టిస్తుంటే గోడలన్నీ అదర సాగాయి. నేను లేచి బయటికి వచ్చాను నీవు ఏంచేస్తున్నావో చూద్దామనిపించింది. నీ గది మొత్తలో దళసరి డోర్ కర్టెన్ నిండుగా వ్రేలాడుతూ నన్ను నిరాశ పరిచింది ఇప్పుడు దళసరి డోర్‌కర్టెన్‌లు వ్రేలాడదీయటం ప్యాషన్ అయ్యింది.



నువ్వు ఒప్పుకోవు గాని—గదిలోని రహస్యం బైటపడకుండా ఉండటానికే యీ డోర్ కర్టెన్లు అవును సుమీ మరిచే పోయాను—అలాంటి డోర్ కర్టెన్ నా గదిముందు గూడా వ్రేలాడుతుంది

అప్పుడు నువ్వు బంత్రోతును చివాట్లేసేటప్పుడు నా కలం తనంతట తానే ఆగిపోతుంది విషయమేమిటని అడగా లనిపిస్తుంది మళ్ళీ అనిపిస్తుంది—బంత్రోతును చివాట్లుబెడ్తుంటే—నేను శ్రద్ధగా వినటం, నీకు నచ్చకపోవచ్చని. నీకు తెలియకపోవచ్చు గాని—నువ్వు గట్టిగా నిశ్వసించినా అది నా గదిలోకి వచ్చేదాకా ఆగదని నీ ప్రతి కదలిక నాకు తెలుస్తుంటుంది.

ఒకరోజు నా గదిలో ఫ్యాన్ ఆగింది. బహుశ విద్యుత్ప్రసార లోపంగావచ్చు. కొద్దిసేపు నేను చిర్రెత్తి పోయాను. ఉక్కను భరించలేక మన గదుల ముందున్న వరండాలోకి వచ్చేశాను. నాకు తెలుసు నీ గదిలో ఫ్యాన్‌గూడా తిరగటం లేదని. అయినా నేను కొంచెం నీ గదిలోకి తొంగిచూచి "మీ ఫ్యాన్ తిరుగుతుందా?" అని అడిగాను. నా ఉద్దేశంలో "లేదు, తిరగటం లేద"ంటూ నువ్వు వరండాలోకి వచ్చేస్తావనుకున్నాను.

"ఒకటి రెండు నిమిషాలు బయటికి వచ్చి నిలబడటంలో భయమేముంది?'

"లేదు. ప్యాన్ తిరగటంలేదుగాని వెనుక కిటికీలు తెరిచే"నన్నావు. గాని

గదిలోంచి వరండాలోకి వచ్చేశాను నేను ఎంత నిరాశ చెందానో నీకేం తెలుసు?

ఒకసారి పని చేస్తున్నప్పుడు నా చేతి నుండి కలం జారిపడింది పాళీ వంగి పోయింది. అప్పుడు నీ గదిలోనుండి కలం తెప్పించుకుందామనుకున్నాను. కాని నా దగ్గర కలం అదనంగా లేదని నువ్వెక్కడంటావోననే భయం. అంటావనే నమ్మకం లేదు. చాలాసార్లు ఇలాగే అవుతుంది ప్రశ్నలు మనమే వేసుకొని జవాబులు మనమే యిచ్చుకుంటాము.

మన గదులను వేరుచేసే యీ గోడ కూలిపోవాలని అప్పుడప్పు డనిపిస్తుంది గాని దానివల్ల నీకూ గది పూర్తిగా ఉండదు నాకూ గది పూర్తిగా ఉండదు సువిశాలమైన పెద్ద గదిలో ఒకవైపు నువు మరోవైపు నేనూ అవుతే-గాని అట్లవుతే బాగుండదేమో! భవనం కట్టించినవాడు ఏదో ఆలోచించే ఇలా వేరు-వేరు గదులు చేసి వుంటాడు గదూ!

మళ్ళీ యీ దృఢమైన సిమెంటు గోడ లోంచి గూడా ఒక్కొక్కసారి నిన్ను చూడగలుగుతున్నట్లుండేది. అప్పుడు అనిపించేది. ఇప్పుడు నువ్వు పనిచేయటం లేదని, ఇప్పుడు కప్పుకేసి చూస్తున్నావని, మరొకసారి చేతిలోని గీతల్ని పరిశీలించుకుంటావు ఒకసారి ఫైళ్ళు విప్పి మరుక్షణమే కట్టి పడేస్తున్నట్లు ఒకసారి బూట్లు విప్పిపడేసి మళ్ళీ తొడిగేసావని___

ఒక్కొక్కసారి నువ్వు చాలా సంతోషంగా ఉంటావు. అప్పుడు బల్లపై ఉన్న గుండ్రని పేపరువెయిట్ గిర-గిర త్రిప్పుతావు. మెల్లిగా యీలవేస్తుంటావు. కుర్చీని గోడకానించి చేరగిలబడి కాళ్ళు వేలాడవేసి ఊపుతుంటావు. అప్పుడు నేను నా గదిలో ఏ మాత్రం ధ్వని కానివ్వను ఎందుకు? అంటావా? నా గదిలో అలికిడవుతేనీ ఆనందానికి అంతరాయం కలుగుతుందని

ఒకొక్కసారి నువ్వు వస్తూ పోతూ గది బయట కనిపిస్తావు "విశేషాలేమిటని" యాదృచ్ఛికంగా అడుగుతావు

నేను చిరునవ్వుతో "ఏమీ లేవంటూ" ను నువ్వు నీ గదిలో కెళ్ళిపోతావు - నేను నా గదిలోకి. ఆ గది యిటుగాని యీ గది అటుగాని మారలేవు రెంటిమధ్య ఒక సన్నని గోడ మాత్రమే ఉన్నా వాటికి తమ తమ హద్దులున్నాయి

నువ్వు ఏ రోజు ఆఫీసుకురావో- నీ గదిలో కూర్చోవో, ఆరోజు నా కేదోలా ఉంటుంది. నా మనస్సు పరిపరివిధాల పోతుంది. ఆరోజు ఎన్నిసార్లు గడియారం చూసుకుంటానో తెలియదు అనేకసార్లు మంచినీళ్ళు త్రాగుతాను ఎవరెవరికో ఫోనుచేస్తాను. పేరుకపోయిన పాత ఫైళ్ళపై దుమ్ము దులుపుతాను- ఒక్క ఫైలుగూడా డిస్పోజు చేయలేను గదిలో ఉండలేక బయిటికి వచ్చేస్తాను. తెలిసీ ఉండగూడా నీ బంట్రోతు నడుగుతాన

మూలం
డా॥ దులీప్ కార్ టివాణ

తెలుగు
'మంజు'

'అయ్యగారు రాలదం! అని.

అప్పుడతను - నీ గురించి తప్పేళ్ళు చెప్తాడు 'అయ్యగారి వంట్లో బాగుండ లేదనో - బంధువులొచ్చారనో- క్యాంపు కెళ్ళారనో!

నీవు ఆఫీసుకు రానిరోజు అనవసర మైన ఆలోచనలు గూడుకుంటాయి నేటికి వంద సంవత్సరాల క్రితం ఇక్కడే ముండేది? ఎవరుండేవారు వంద సంవ త్సరాల తరువాత ఎవరుంటారు వారి భావాలెలా ఉంటాయి మనుషులు చని పోవటం ఎంత ఖాయమో - పుట్టటం కూడా అంతే ఖాయం ఇలాంటి ఆలో చనలతో వణికిపోతాను గటగటా నీళ్ళు తాగేస్తాను ఇలా ఎన్నిసార్లు త్రాగుతానో లెక్కించలేను గదిలో భయమేసి- ఆఫీ సులో కెళ్ళి కూర్చుంటాను

నువ్వు వచ్చినరోజు తెలిసిగూడా అడుగుతాను "ఇన్నిరోజులు రాలేదమని" అడుగకూడదనుకుంటానుగాని అడుగ కుండా ఉండలేను

"ఆరోగ్యం బావుండలేదంటావు."

"ఇప్పుడు కుదుటపడింది గదా?"

"ఆఁ! యిప్పుడు- మీ దయవల్ల కుదుటపడింద"ని అంటావు నువ్వు నీ గదిలో కెళ్ళిపోతావు నేను నా గదిలోకి నువ్వు నీ పనిలో లీనమైపోతావు నేను నా పనిలో ___

నీకు గుర్తుందా? ఓసారి నేను సెలవు పెట్టాను నువ్వు నా బంట్రోతునడిగావు "అమ్మగారు రాలేదా"ని అతను 'జ్వరం వచ్చిందన్నాడట '

"అలాగా!" అని నువ్వు ఎప్పటిలాగే నీ గదిలోకి వెళ్ళిపోయావుట. పోస్టు తెచ్చి నప్పుడు నా బంట్రోతు నువ్వడిగినట్లు

పంజాబి విశ్వవిద్యాలయం పంజాబి భాషా విభాగంలో రీడర్ గా పని చేస్తు న్నారు. మతపు కట్టుబాట్లను గూడా ఆదర్శాలకు వదులుకున్న స్త్రీ భారత ప్రభుత్వం యీమె "సముందర్ తే సూరజ్" నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి నిచ్చి గౌర వించింది.

—మంజు

---

చెప్పాడు నా గుండెల్లో గిలిగింతలుపెట్టి నట్లైంది. మరునాడు నా జ్వరం కొంచెం తగ్గింది నేను నీరసంగా ఉన్నా ఆఫీసుకు వచ్చాను. బహుశ నీకు గుర్తుందో లేదో ఆరోజు నీవు బంట్రోతును రెండు మూడుసార్లు చీవాట్లు పెట్టావు

అనేకసార్లు కాగితాలు చించేసావు. తప్పులు వ్రాసి చించుకొని ఉంటావు ఒకరిద్దరికి ఇంటర్వ్యూ ఇవ్వకుండానే పంపించేశావు నేను గదిలో ఉండలేక బయిటికి వచ్చేసాను నువ్వూ బయిటికి వచ్చావు

"ఇన్ని రోజులు రాలేదేం?" నువ్వు తెలిసిగూడా అడిగావు

"ఆరోగ్యం బావుండలేదు "

"ఇప్పుడు కుదుటపడింది గదా?"

"ఆఁ! ఇప్పుడు మీ దయవల్ల కుదుట పడిందంటూ నేను నా గదిలోకి వచ్చే సాను. నువ్వు నీ గదిలోకి వెళ్ళుంటావు. ఈ గది అటుగాని ఆ గది ఇటుగాని మారలేవు రెంటికి తమ తమ హద్దు లున్నాయి రెంటిమధ్య ఒక ఇటుక సిమెంటుతో కట్టిన గోడ ఉంది. ఒక గది నీది ఒక గది నాది మన గదులు ప్రక్క ప్రక్కనే ఉన్నాయి అదే చాలని. మన మధ్య కేవలం ఒక గోడేగదా ఉంది. ***